నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: విద్యుత్ కొత్త సర్వీసుల ఏర్పాటు, ఫీడర్‌ల మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యలక్ష్మికాలనీ, హుడాకాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, తులిప్‌గార్డన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 3 నుంచి 13 వరకు, పుప్పాలగూడ గ్రామం, మారుతీనగర్, దుర్గానగర్, రాఘవేంద్రకాలనీ, గోల్డన్ ఓరియన్, మానస అపార్ట్‌మెంట్, ఎల్ఐసీ కాలనీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 8 ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ వివరించారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు పంచవటి కాలనీ, మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు శ్రీరాంనగర్ కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, హనుమాన్‌నగర్ కాలనీ, సత్తమ్మ కాలనీలతో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నెమలినగర్, క్రిన్స్ విల్లాస్, సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు పంచవటి కాలనీ రోడ్డు నెంబర్ 16 నుంచి 32 వరకు, రోడ్డు నెంబర్ 5, జనచైతన్య కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, గోల్డన్ టెంపుల్, తిరుమల హిల్స్ రోడ్ నెంబర్ 4 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వివరించారు.

నరేష్ కలస్కార్‌కు డాక్టరేట్



రాజేంద్రనగర్: ఇంజినీరింగ్ నిర్మాణ రంగంలో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి రాజేంద్రనగర్ టీచర్స్ కాలనీకి చెందిన డాక్టర్ నరేష్ కలస్కార్ డాక్టరేట్ అందుకున్నారు. భారత మౌలిక సదుపాయాల రంగానికి మార్గదర్శక పరిశోధన అనే అంశంపై నిర్మాణ ఇంజినీరింగ్‌లో చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన పరిశోధన విశ్వ విద్యాలయ ఇంజినీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ భిక్షు పర్యవేక్షణలో కొనసాగిందన్నారు. నిర్మాణ రంగంలో దేశంలోనే తన పరిశోధన అత్యాధునికమైందన్నారు. కాంక్రీట్ మిశ్రమంపై ఇది కేంద్రీకృతమై ఉందన్నారు. ఎం 80 నుంచి ఎం 150 వరకు ఉన్న గ్రేడ్లలో అత్యధిక బలాన్ని కలిగి ఉంటుందన్నారు. 50 అంతస్తుల పైగా ఉన్న భవన నిర్మాణం, అత్యాధునిక రక్షణ వంతెనలు, అణు విద్యుత్ కేంద్రాలకు అవసరమైన నిర్మాణ పదార్థాల అభివృద్ధికి ఈ పరిశోధన దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. తన పరిశోధనలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా రాణిస్తున్న 'సర్కారు'విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి పి.కార్తీక్ రంగారెడ్డి జిల్లా టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠశాలను శ్రద్ధగా విని నేర్చుకొని నైపుణ్యవంతులగా ఎదగాలన్నారు. ప్రభుఏత్వ పాఠశాలల విద్యార్థులను ప్రొత్సహించేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయులు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బిర్యానీ తిని వివాహిత మృతి

- భర్త ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతురాలి సోదరి

రాజేంద్రనగర్: ఫుడ్ పాయిజన్‌తో తన సోదరి మృతి చెందిందని రాజేంద్రనగర్ పోలీసులకు ఓ మహిళ శుక్రవారం ఉదయం ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు... ఎర్రబోడ ప్రాంతానికి చెందిన రమేశ్(48), రాజేశ్వరి(38)లు భార్యాభర్తలు. రమేశ్ బాలానగర్‌లోని ఓ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చే సమయంలో బాలానగర్‌లోని ఓ రెస్టారెంట్ నుంచి బిర్యానీ తీసుకొచ్చి అదే రోజు రాత్రి భుజించి నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజాము నుంచి వాంతులు, విరోచనాలు ప్రారంభమయ్యాయి. దీంతో స్థానికంగా ఉన్న ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు. గురువారం రాజేశ్వరి మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. రమేశ్ సైతం అనారోగ్యంతో ఉండటంతో ఉప్పర్‌పల్లిలోని ఆస్పత్రికి తరలించారు. ఫుడ్ పాయిజన్ కారణంగా తన సోదరి మృతి చెందిన రాజేశ్వరి అక్క శుక్రవారం ఉదయం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.





నీటి ఎద్దడి తీవ్రం.. ట్యాంకర్లే శరణ్యం



వేసవిలో భానుడి ప్రతాపం రోజురోజుకూ తీవ్రం అవుతోంది. అదే స్థాయిలో బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా నీటి ఎద్దడి పెరుగుతోంది. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లలోని బోర్లు ఎండిపోతున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. జలమండలి నల్లాల ద్వారా సరఫరా చేసే నీరు అంతంతమాత్రంగానే వస్తోంది. తక్కువ సమయం అదీ లో ప్రెషర్‌తో వస్తున్నందున కనీస అవసరాలకు కూడా నీరు సరిపోవడం లేదు. గడచిన వారం రోజులుగా ప్రజలు పెద్ద ఎత్తున ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏ వీధిలో చూసినా, ఏ అపార్ట్‌మెంట్ వద్ద చూసినా ప్రైవేటు, ప్రభుత్వ నీటి ట్యాంకర్లే దర్శనమిస్తున్నాయి. సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ డివిజన్లలో వందల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నల్లాల్లో నీరు సక్రమంగా రాకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నామని వివిధ కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– శాస్త్రిపురం

నీటి సరఫరా సమయాన్ని పెంచండి

మణికొండ: వేసవిలో నీటి ఎద్దడి తీవ్రం అవుతున్న నేపథ్యంలో జలమండలి అధికారులు నల్లాల ద్వారా నీరు సరఫరా చేసే సమయాన్ని పెంచాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా సెక్రటేరియట్ కాలనీ, తిరుమలహిల్స్ కాలనీలలో పర్యటించారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ... నీటి అవసరం అంతగా లేని సమయంలో



సెక్రటేరియట్ కాలనీలో సమస్యలు తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు

గంట 15 నిమిషాలు ఇచ్చి ప్రస్తుతం దాన్ని 45 నిమిషాలకు కుదించటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. జలమండలి అధికారులు స్పందించి వెంటనే మున్సిపాలిటీ వ్యాప్తంగా గంట 15 నిమిషాలపాటు నల్లాల్లో నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో జలమండలి కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. పందెన్‌వాగు పరీవాహకం చెత్తాచెదారంతో నిండిపోవటంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధంతోపాటు దోమల బెడద పెరిగిపోయిందన్నారు. వీధి దీపాలు చాలా ప్రాంతాల్లో వెలగడం లేదన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నేతలు ఎ.లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్, బాబు, మల్లేష్, దిలీప్, సుమ నళిని తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ను కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు శుక్రవారం కలిశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లు ఇతర ముఖ్యనేతలతో రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. ఏప్రిల్ 8న బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఉభయ సభల్లో చేసిన బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపి రాష్ట్రపతికి పంపిన నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, కేశవరావు, మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యు లు అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేషన్ చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వివరించారు.

బోటిగూడ పంచాయతీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని బోటిగూడ పంచాయతీ కార్యాలయాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. రామంజాపూర్ పంచాయతీకి అనుబంధంగా ఉన్న బోటిగూడను పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి వచ్చే ఎన్నికల్లో సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని సూచించారు. పంచాయతీ ఏర్పాటుతో స్థానికులకు ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. సష్టిగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకుని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మున్నీ తదితరులు పాల్గొన్నారు.

హుమయూన్‌నగర్ పీఎస్ పేరు మార్పుపై హర్షం

గోల్కొండ: హుమయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పేరు మార్చడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేషన్ పేరును పోలీసులు హుమయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి మెహిదీపట్నం పీఎస్‌గా పేరు మార్చారు. ఈ ప్రాంతానికి కొత్తగా వచ్చే వారికి హుమయూన్‌నగర్ అనే విషయం తెలియదు. ఒక కాలనీ పేరును పోలీస్‌స్టేషన్‌గా పెట్టడం అప్పట్లోనే చర్చనీయాంశంగా మారింది. మెహిదీపట్నం నడిబొడ్డులో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను హుమయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్‌గా పిలవడం సరికాదని గతంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: తాము చదువుకున్న కోర్సును పూర్తి చేసి పట్టాలు అందుకుంటున్న వారి ఆత్మవిశ్వాసం అత్యున్నత స్థాయిలో ఉంటుందని ఇండియా హెడ్ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయకడియాల అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి విజయకడియాల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యార్థుల జీవితంలో గ్రాడ్యుయేషన్ డే ఎంతో కీలక ఘట్టం అని అన్నారు. జీఎన్ఐటీఎస్ చైర్మన్ జి.రాఘవరెడ్డి , వైస్ చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి, సి.నర్మద, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, వి.నర్మద, కళాశాల పూర్వ విద్యార్థినులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

అత్తాపూర్: జన గణనతో పాటు కుల గణనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదించినందుకు బీజేపీ నాయకులు శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు నులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని సేవలను కొనియాడారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కొమురయ్య, రాచూరి రాజశేఖర్, జయానంద్‌రెడ్డి, కిరణ్, విజయ్‌కుమార్, నల్లింగ్ రమేష్, జి.రాజు, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.జగన్, పి.వెంకట్‌రెడ్డి, శశికాంత్‌శర్మ, అనురాధ,



ఉమా, స్వప్న, శ్రీకాంత్‌చారి, విశాల్, బాలకృష్ణ, ముఖేష్, రాము, విజయ, స్వామి, భరత్, శివ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రామానుజుల మార్గం అనుసరణీయం




రామానుజుల సువర్ణ మూర్తికి పూజలు నిర్వహిస్తున్న చినజీయర్‌స్వామి

- త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి
- ఘనంగా రామానుజుల జయంతి ఉత్సవాలు

శంషాబాద్ రూరల్: శ్రీ భగవద్రామానుజులకు మనమంతా దాసులం.. ఆయన చూపిన మార్గాన్ని అనుసరిద్దామని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి పిలుపునిచ్చారు. రామానుజ స్వామి 1008 జయంతి ఉత్సవాల సందర్భంగా శంషాబాద్ మండలంలోని స్ఫూర్తి కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. చినజీయర్ స్వామి పర్యవేక్షణలో తిరునక్షత్ర మహోత్సవాలు జరిగాయి. సువర్ణ రామానుజులకు అభిషేకం చేశారు. కళాకారులు, భక్తులు భజన, కోలాలతో సమతామూర్తికి భక్తి నివేదన చేశారు. ఈ సందర్భంగా చినజీయర్‌స్వామి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

గోల్కొండ: తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన షేక్‌పేట్‌లోని జలమండలి డీజీఎం కార్యాలయం వద్ద అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నీటి సరఫరా విషయంలో ప్రతినిత్యం తనకు వచ్చే ఫిర్యాదుల సంఖ్య పెరుగుతుందన్నారు. పలుచోట్ల లో ప్రెషర్‌తో నీరు వస్తుందని చిన్న కుటుంబానికి సైతం లో ప్రెజర్‌తో వచ్చే నీరు తాగడానికి సైతం సరిపోవడంలేదన్నారు. తాను గత వారం బస్తీలలో పర్యటించినప్పుడు తాగునీటి పైపులైన్‌ల లీకేజీల వల్ల



తాగునీరు వృథా అవుతుందన్నారు. అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సీజీఎం వినోద్ భార్గవ్, జీఎం శ్రీనివాస్, డీజీఎం లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్‌జమా తదితరులున్నారు.

కార్తీక్‌కు డీఈఓ అభినందన

మైలార్‌దేవ్‌పల్లి: టెన్త్‌లో రంగారెడ్డి జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి కార్తీక్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆదర్శమని రంగారెడ్డి జిల్లా డీఈవో సుసీందర్‌రావు, విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లాలోనే ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పి.కార్తీక్ (584/600) సాధించిన సందర్భంగా శుక్రవారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారని గుర్తుచేశారు. వారిని గుర్తించి ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తున్నామని స్పష్టం చేశారు.



కార్తీక్‌ను అభినందిస్తున్న డీఈవో

పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి, సైన్స్ ఉపాధ్యాయులు ఎస్.మాణిక్యంరెడ్డి, పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ శిల్పులు

బండ్లగూడ: నేటి బాలలే రేపటి పౌరులని.. అలాంటి ఉత్తమ పౌరులను తీర్చిదిద్ది నవ సమాజాన్ని రూపుదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అనిర్వచనీయమని విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదా ధామంలో శ్రీ సరస్వతీ శిశు మందిరంలో సేవలందిస్తున్న నూతన ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... విద్యాభారతి దేశవ్యాప్తంగా 12,000 శిశు మందిరాలతో పాటు మారుమూల అటవీ ప్రాంతంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు, గిరిజన ప్రాంతంలో వనవాసీ ఉచిత ఆవాస విద్యాలయాలను నిర్వహిస్తోందన్నారు. సామాజికంగా వెనుకబడిన బస్తీలు, మారుమూల ప్రాంతంలో శ్రీ సరస్వతీ బాల సంస్కార కేంద్రాలను నిర్వహిస్తున్నదన్నారు. తరగతి గదిలోని విద్యార్థులను ఒక కార్యప్రణాళిక ప్రకారం ఉత్తములుగా తయారు చేసేవారు ఉపాధ్యాయులే అన్నారు. బోధన విషయం, బోధనేతర విషయంలోనూ చక్కటి అవగాహన కలిగి ఉండాలన్నారు. పుస్తకాలలోని విషయాలను మాత్రమే కాకుండా విద్యార్థులకు సామాజిక అవగాహన, వర్తమాన విషయాలు అందిస్తూ విద్యార్థులను రేపటి తరానికి అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సూచించారు. సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్‌రావు, ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, ప్రాంత అధ్యక్షుడు తిరుపతిరావు, ప్రాంత అకడమిక్ ఇన్‌చార్జీ కృష్ణమాచార్యులు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పరమానంద బన్సల్, విభాగ్ కార్యదర్శి విరివింటి రవీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పరిశ్రమల యజమానులకు సమ్మె నోటీసులు



సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: కార్మిక హక్కుల సాధనే లక్ష్యంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మికులంతా తరలిరావాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ పిలుపునిచ్చారు. కాటేదాన్ క్లస్టర్‌లోని పరిశ్రమల్లోని యాజమాన్యాలకు శుక్రవారం సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ... పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తున్నదన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి కార్మికులను ముప్పుతిప్పలు పెడుతోందని దుయ్యబట్టారు. వెంటనే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అందించాలన్నారు. అన్ని రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు రూ. 28 వేల ప్రకారం వేతనాలను ఇవ్వాలన్నారు. సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి పి.సి.కె.భాస్కర్, సువార్త, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీతోనే అన్ని వర్గాల అభ్యున్నతి

మైలార్‌దేవ్‌పల్లి: అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం, అభ్యున్నతి ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద శుక్రవారం డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్ధన్ ఆధ్వర్యంలో నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... దేశ రక్షణపై దృష్టి సారించి కేంద్రం జనాభా లెక్కలతో పాటు కుల గణనను కూడా చేపట్టాలని నిర్ణయించడాన్ని దేశ ప్రజలందరూ హర్షిస్తున్నారన్నారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ అసాధారణ నిర్ణయాలను తీసుకుంటూ ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసేలా పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, నేతలు రావుల భాస్కర్, నెలుట్ల జగన్, పాండుయాదవ్, నర్సిరెడ్డి, ఎల్.వి.రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మీ, అంజమ్మ, నందిని, మజార్, సి.హెచ్.ప్రభుదాస్, షకీల్, కొండలు, రాజవర్ధన్‌రెడ్డి, ఎన్ను శంకర్‌రెడ్డి, ఏ.శివ, జి.శంకర్, రామారావు, శేఖర్, రవి, అంజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కూలర్లకు భలే డిమాండ్

శాస్త్రిపురం: ఎండలు మండుతున్నాయి. ఉదయం 10 గంటల తరువాత ఇళ్లనుంచి బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు. మధ్యాహ్నం ఎండ వేడి, ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో భానుడి ప్రతాపాన్ని తట్టుకునేందుకు వివిధ మార్గాలను ప్రజలు ఎంచుకుంటున్నారు. అందులో భాగంగా పేద, మధ్య తరగతి ప్రజానీకం ఎయిర్ కూలర్లను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్‌ల పరిసర ప్రాంతాలలోని దుకాణాల్లో కూలర్ల విక్రయాలు పెరిగాయి. కూలర్లను కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో వాటికి డిమాండ్ పెరిగింది. ఒక్కో కూలర్ ధర రూ. 3 వేల నుంచి ఉండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు వాటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో కూలర్ల వ్యాపారం బాగా సాగుతోందని వ్యాపారులు చెబుతున్నారు.



సులేమాన్‌నగర్‌లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూలర్లు

జీతాలు చెల్లించాలని మౌన ప్రదర్శన

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయితీ రాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్) ఉద్యోగులు, పెన్షనర్స్ ఎన్ఐఆర్‌డీపీఆర్ ఎదుట మౌన ప్రదర్శన చేశారు. తమ జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నోటికి నల్ల గుడ్డలు కట్టుకుని నిరసన తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు.



